సమావేశంలో మాట్లాడుతున్న పుణ్యవతి

మనుధర్మ శాస్త్రాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతున్నారు

- అక్టోబర్ 5న ఢిల్లీలో భారీ ప్రదర్శన
- ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మహిళల హక్కులను కాలరాసే మనుధర్మ శాస్త్రాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చుతోందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి అన్నారు. ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండ్రోజులు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సోమవారం ప్రారంభ సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ బడులను మూసేస్తుండడంతో బాలికలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశ విదేశాల్లో మహిళలు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లేక సతమతమవుతుండగా.. ఇంకోవైపు మతోన్మాద శక్తులు మహిళల హక్కులను నీరుగార్చుతున్నాయన్నారు. దేశంలో ప్రస్తుతం కార్పొరేట్ మతోన్మాద శక్తుల కలయికతో ప్రజల జీవితాలు అతలాకుతలమవుతున్నాయని చెప్పారు. అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరులు అవుతుండగా.. పేద ప్రజల జీవితాలు మరింత దుర్భరమవుతున్నాయని చెప్పారు. మహిళలు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, లైంగికదాడులు, హింస పెరిగిందన్నారు. మోడీ వ్యతిరేక ప్రచార క్యాంపెనింగ్‌ను ఐద్వా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చేపడుతుందని చెప్పారు. ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ మహిళలను పెద్దఎత్తున సమీకరించి అక్టోబర్ 5న ఢిల్లీలో పెద్ద ప్రదర్శన చేపట్టనున్నట్టు చెప్పారు.
ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలపై మహిళలను చైతన్యవంతం చేయాల్సిన అవసరాన్ని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, నాయకులు ఎం భారతి, పి ప్రభావతి, కెఎన్ ఆశాలత, బి అనురాధ, రామేశ్వరి, టి జ్యోతి, బి సరళ తదితరులు పాల్గొన్నారు.

బిజెపివి విభజన రాజకీయాలు

- తెలంగాణలో ఉన్న మూడు సీట్లూ రానీయం
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిజెపి దేశంలో రాష్ట్రంలో విభజన రాజకీయాలు చేస్తోందని, తెలంగాణలో ఉన్న మూడు సీట్లైనా ఈసారి ఆ పార్టీకి రానివ్వబోమని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. రైతాంగ పోరాట స్ఫూర్తితో తెలంగాణ గడ్డమీద బిజెపిని అడుగుపెట్టనివ్వబోమని చెప్పారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో 'మన ఉత్పత్తులు మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఉత్పత్తుల కేంద్రం స్టాల్స్‌ను ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మన ఉత్పత్తులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేందుకు, వారిని ప్రోత్సహించేందుకే సుమారు రూ.20 లక్షలతో మన ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. మోడీ, అమిత్ షా ఇద్దరూ దేశంలో ఇద్దరు ముగ్గురు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. దేశాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలోని మేధావులు, కవులు, కళాకారులందరూ విభజన రాజకీయాలపై ఆలోచించి, వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డిఆర్‌డిఎ పిడి ఉపేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధ, ఉద్యోగుల శాఖ జిల్లా అధికారి అన్నపూర్ణ, మెప్మా పిడి రమేష్ బాబు పాల్గొన్నారు.

పంట నష్టంపై రీ-సర్వే చేయాలి

- వ్యవసాయ శాఖ అధికారిని నిర్బంధించిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో అకాల వర్షాలకు జరిగిన పంట నష్టం సర్వేను తిరిగి నిర్వహించాలని కర్ల పెల్లి శివారు రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో పంట నష్టం రానందుకు నిరసనగా స్థానిక వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డిని నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ములుగు జిల్లా వ్యాప్తంగా 120 ఎకరాలు మాత్రమే పంట నష్టపరిహారం రావడం జరిగిందని సోషల్ మీడియాలో ప్రచురితం అయ్యిందని అన్నారు. మండల వ్యాప్తంగా వందలాది ఎకరాలు నష్టపోతే అధికారులు నివేదికలను సంక్రమంగా పంపించలేదని ఆగ్రమం వ్యక్తం చేశారు. నష్టపరిహారం సర్వేను తిరిగి నిర్వహించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్లపెల్లి శివారు లక్ష్మీపురం అమృతండా చంద్రు తండా కర్లపెల్లి గ్రామాల రైతులు, జిమ్మిలాల్ తండా సమ్మయ్య కల్తీ నరసయ్య, జిల్లెల జంపయ్య, లాకావత్ రఘురాం, గుగులోతు భాస్కర్, వాసం వెంకటేశ్వర్లు, గజ్జి ప్రభాకర్, గజ్జి వెంకన్న, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఒకటి తిరస్కరణ.. రెండింటిపై వివరణ కోరిన గవర్నర్

పెండింగ్ బిల్లులపై తమిళిసై నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ బిల్లులపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఒక బిల్లును తిరస్కరించి.. మిగిలిన రెండు బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరారు. డిఎంఇ (డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) సహా వైద్యవిద్యలో పాలనాపరమైన పోస్టుల పదవీ విరమణ వయస్సు పెంపునకు ఉద్దేశించిన చట్టసవరణ బిల్లును తమిళిసై తిరస్కరించారు. పురపాలికల్లో అవిశ్వాస తీర్మానం గడువును మూడు నుంచి నాలుగేళ్లకు పొడిగింపు, కో-ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంపునకు ఉద్దేశించిన పురపాలిక చట్టసవరణ బిల్లు, కొత్తగా మరికొన్ని ప్రయివేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతిస్తూ తీసుకొచ్చిన చట్టసవరణ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణ కోరారు. గతంలోనే మూడు బిల్లులకు ఆమోదం తెలిపిన గవర్నర్..రెండింటిని రాష్ట్రపతి సమ్మతి కోసం పంపారు. తాజాగా గవర్నర్ తీసుకున్న నిర్ణయంతో రాజ్‌భవన్‌లో ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేనట్లైంది.

బిఒఎంకు అదిరిపోయే లాభాలు

క్యూ4లో రెట్టింపై రూ.840 కోట్లు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. బ్యాంక్ మొండి బాకీలు తగ్గడం, ఆదాయం పెరగడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 136 శాతం వృద్ధితో రూ.840 కోట్ల లాభాలు సాధించింది. ఇంతక్రితం ఇదే క్యూ4లో రూ.355 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.3,949 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం క్యూ4లో రూ.5,317 కోట్లకు చేరింది. నికర వడ్డీపై ఆదాయం రూ.3,426 కోట్ల నుంచి రూ.4,495 కోట్లకు పెరిగింది. 2023 మార్చి 31తో ముగిసిన ఏడాదికి గాను రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.1.30 లేదా 13 శాతం డివిడెండ్‌ను అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జిఎన్‌పిఎ) 2.47 శాతానికి తగ్గాయి. 2022 మార్చి 31 నాటికి జిఎన్‌పిఎ 3.94 శాతంగా నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 0.97 శాతం నుంచి ఏకంగా 0.25 శాతానికి తగ్గడం విశేషం.

దేశం పురోగమిస్తుందా..? తిరోగమిస్తుందా..?

ధైర్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం ● మార్పు వచ్చే వరకూ బిఆర్‌ఎస్ పోరాటం ఆగదు
ప్రయివేటుపరం చేసిన ప్రభుత్వ సంస్థలన్నిటినీ వెనక్కి తీసుకుంటాం
ఔరంగాబాద్ సభలో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
దేశం పురోగమిస్తుందో లేక తిరోగమిస్తుందో అర్థం కావడంలేదని, ధైర్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, సిఎం కెసిఆర్ అన్నారు. దేశంలో ఏం జరుగుతుందో ప్రతి ఒక్కరూ గమనించాలని చెప్పారు. ఇప్పటికీ ప్రజలకు సాగు, తాగునీరు సరిగా అందడం లేదని చెప్పారు. నీరు అందించని పాపం ఎవరిదని ఆయన ప్రశ్నించారు. సోమవారం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జబిందా మైదానంలో ఏర్పాటు చేసిన బిఆర్‌ఎస్ బహిరంగ సభకు కెసిఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మరాఠా నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా వంటి నదులున్నా.. మహారాష్ట్రకు నీటి సమస్య ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. "ముంబయి దేశ ఆర్థిక రాజధాని.. కానీ, తాగేందుకు నీళ్లుండవా? దేశం పురోగమిస్తోందా.. తిరోగమిస్తోందా? ఆలోచించండి. ఔరంగాబాద్, అకోలాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దేశంలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. పేదలు మరింత నిరుపేదలుగా మారుతున్నారు. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. ఇదంతా మన కళ్లముందే జరుగుతోంది. ఇది ఇలాగే జరగాలా.. చికిత్స చేయాలా.. చెప్పండి. నా మాటలు విని ఇక్కడే మర్చిపోకండి. నా మాటలపై మీ గ్రామాలకు వెళ్లి చర్చ చేయండి. మీ ఇంటివాళ్లు, స్నేహితులు వీధిలో ఉన్నవారందరితో చర్చించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.
ఎంత త్వరగా మేలుకుంటే.. దేశమంత త్వరగా బాగుపడుతుందన్నారు. " సమస్యలకు పరిష్కారం లభించకుంటే ఏం చేయాలి? ఇంకెంతకాలం పరిష్కారం కోసం ఎదురు చూడాలి? ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పిస్తున్నా ఊరుకోవాలా? భయపడుతుంటే ఇంకా భయపెట్టిస్తారు. ధైర్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. మార్పు రాకుంటే దేశం ముందుకెళ్లదు. అనివార్యమైన మార్పును తీసుకురావడం కోసమే బిఆర్‌ఎస్ పుట్టింది. మార్పు వచ్చే వరకు పోరాటం ఆగదు.అన్ని వర్గాలకు సరైన న్యాయం దక్కాల్సిందే." అని తెలిపారు. భారతదేశంలో నీటివనరులు సమృద్ధిగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. సాగు యోగ్యత ఉన్న భూములకు నీటిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ.. ప్రధాని, రాష్ట్రాల సిఎంలకు ఆ పని చేసే సామర్థ్యాలు లేవని విమర్శించారు. నిజాయితీగా బిఆర్‌ఎస్ చేస్తున్న పోరాటానికి విజయం తథ్యమని కెసిఆర్ ధీమా వ్యక్తం చేశారు. " మహారాష్ట్రలో బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఐదేళ్లలోపు ప్రతి ఇంటికి తాగునీరు ఇస్తాం. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మా పోరాటం ఆగదు. తెలంగాణలో సాగునీరు, తాగునీరు సమస్య లేకుండా చేశాం. అదే రీతిలో మహారాష్ట్రను కూడా అభివృద్ధి చేస్తాం. రైతులకు అన్నీ సకాలంలో అందేలా ఏర్పాట్లు చేస్తాం. బిఆర్‌ఎస్‌పై నమ్మకం ఉంచండి. ఒక కులం, మతం, వర్గం కోసం భారాస ఆవిర్భవించలేదు. నిజాయితీగా పోరాడతాం.. అంతిమ విజయం సాధిస్తాం." అని కేసీఆర్ అన్నారు.
తెలంగాణ రాకముందు రోజుకు 3 గంటలే కరెంటు ఉండేదని.. ఒక్కోసారి అది కూడా ఉండేది కాదని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. తెలంగాణలో 24 గంటలు సాధ్యమైనప్పుడు.. మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో ఉచిత విద్యుత్ పథకాన్ని కూడా ఇక్కడ అమలు చేయవచ్చని అన్నారు. " దేశంలో కొత్త లక్ష్యాలు.. సంకల్పంతో ముందుకెళ్లాలి. దేశంలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే వనరులు ఉన్నాయి. దేశం మొత్తం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చు. ఇది అబద్ధమైతే ఒక్క నిమిషమైనా సిఎం పదవిలో ఉండను" అని కెసిఆర్ తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తిరిగి ప్రభుత్వపరం చేస్తామన్నారు. దేశంలోని సమస్యలను మనమే పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. పాలనా సామర్థ్యం గల అధికారులు ఉన్నప్పటికీ.. తెలంగాణ తరహా పథకాలు ఇక్కడ ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం చట్టాలు అవసరమని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో కచ్చితంగా విజయం సాధిస్తామని కెసిఆర్ ధీమా వ్యక్తం చేశారు.

గ్రామ దీపికల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
గ్రామదీపికల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న గ్రామదీపికల నిరవధిక సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ దీపికలతో వెట్టిచాకిరి చేయిస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రామదీపికులకు నెలకు రూ.27 వేల గౌరవవేతనం ఇచ్చి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే భవిష్యత్తు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందిరాక్రాంతి పథకంలో పనిచేస్తున్న వారిలో గ్రామదీపికలను విడగొట్టే ప్రయత్నాలను కొద్ది మంది చేస్తున్నారని, అటువంటి వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రమ్య, మండల కన్వీనర్ టిఎస్ కళ్యాణ్, గ్రామదీపికల సంఘం మండల కన్వీనర్ దమ్మాలపాటి శారద, సిపిఎం నాయకులు మందరపు వెంకన్న, వేల్పుల భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

చైనా కంటే మనమెందుకు వెనుకబడ్డాం?

- మతాలు, కులాల పేరిట పనికిమాలిన సంభాషణలు
- అమిత్ షాపై కెటిఆర్ విమర్శలు
- సిఎంఎస్ఇఐ, ఎంఎస్ఎంఇ లబ్ధిదారులకు చెక్కులు, వాహనాలు అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
'చైనా కంటే భారతదేశం ఎందుకు వెనుకబడింది? 1987లో రెండు దేశాల జిడిపి ఒకే దగ్గర ప్రారంభమైంది. 36 ఏళ్ల తర్వాత చైనా జిడిపి 18 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. భారతదేశ జిడిపి 3.4 ట్రిలియన్ డాలర్లు మాత్రమే. అంటే చైనా మనకంటే ఆరు రెట్లు ఎక్కువ జిడిపిని కలిగి ఉంది' అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సిఎంఎస్ఇఐ, ఎంఎస్ఎంఇ లబ్ధిదారులకు చెక్కులను, వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ అమెరికా, జర్మనీ, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడడమే లక్ష్యంగా చైనా ఎదిగిందన్నారు. మన దేశంలో సహజ వృద్ధి తప్ప మరో వృద్ధి జరగలేదని తెలిపారు. నేటి పాలకుల దృష్టంతా ఏ మతం గొప్పది? ఏ కులం గొప్పది? అనే వాటిపైనే ఉందని దుయ్యబట్టారు. ఎనిమిదేండ్లలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.24 లక్షల నుంచి 3.17 లక్షలకు పెరిగి భారతదేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెప్పిందన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఇచ్చిన అవార్డుల్లో తెలంగాణ 30 శాతం అవార్డులు కైవసం చేసుకుందని గుర్తు చేశారు. ఎనిమిదేండ్లలో తలసరి ఆదాయాన్ని తెలంగాణ 162 శాతం పెంచుకోగలిగితే, అదే రకమైన వృద్ధిని మిగిలిన రాష్ట్రాలు ఎందుకు సాధించలేకపోయాయి? అలా సాధించి ఉంటే చైనా మాదిరిగానే భారతదేశం కూడా అగ్రదేశాలతో పోటీ పడేది అని పేర్కొన్నాయి. కుల, మతాలు దేవుని సృష్టించినవి కావని, వాటిని మనిషి కల్పించుకున్నవేనని తెలిపారు. నీళ్లు, విద్యుత్‌పై చర్చించకుండా నా దేవుడు గొప్పా? నీ దేవుడు గొప్పా? అనే చర్చల వల్ల ప్రయోజనం లేదన్నారు. సమాజం తనకు తాను ఎన్ని రకాలుగా విభజించుకున్నా, కరోనా ఉపద్రవం విశ్వ మానవాళి అంతా ఒక్కటేనని గుర్తు చేసిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారతదేశం అవతరించినా, ఇప్పటికీ ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఒక ఆవిష్కరణ అందించలేకపోవడానికి పాలకుల వైఫల్యమే కారణమన్నారు.

కులాన్ని పెట్టుబడితో కొట్టాలి

కులాన్ని పెట్టుబడితో కొట్టాలని డిక్కీ జాతీయ అధ్యక్షులు చెప్పిన మాటలను తనను బాగా ఆకర్షించాయని కెటిఆర్ ఈ సందర్భంగా తెలిపారు. కుల నిర్మూలన జరిగి అంతరాలు లేని సమాజం రావాలని అంబేద్కర్ ఆశించారని, ఆయన ఆశయ సాధన కోసం ముందుగా యువత ఆత్మన్యూనత నుంచి బయటపడాలని అన్నారు. రిస్క్ తీసుకోవద్దు, అప్పు చేయొద్దు. ప్రభుత్వ ఉద్యోగమైతేనే జీవితానికి భద్రత... వంటి చెడగొట్టు సామెతల నుంచి బయటపడాలని సూచించారు. అందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకోసం ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకరిస్తామని తెలిపారు. పడిపోతే తిరిగి లేవాలని, ఓటమిని కూడా ఉత్సవంగా జరుపుకునేంత ధైర్యంతో నిలబడాలన్నారు. గిరిజన యువత కూడా ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హామీలకే పరిమితం : సత్యవతి రాథోడ్

తండాలను గ్రామపంచాయతీలు చేస్తామంటూ దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చి మోసం చేసిందని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. కానీ, బిఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని అమలు చేసి చూపించిందని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, వాటికి రోడ్లతో అనుసంధానం, గిరిజన సంక్షేమ హాస్టళ్ల భవనాల నిర్మాణం, రెసిడెన్షియల్ విధానంలో డిగ్రీ కళాశాలలు, పెండ్లికి కల్యాణలక్ష్మి, ఆరోగ్యంగా ఉండేందుకు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ తదితర పథకాలతో సిఎం కెసిఆర్ గిరిజనులకు జీవిత కాలానికి సరిపడినన్ని ఇచ్చారని కొనియాడారు. ఈ సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ట్రైకార్ చైర్మెన్ రామచంద్రు నాయక్, జీఎం శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో దేశానికి పెను ప్రమాదం

ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో
రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో దేశానికి పెనుప్రమాదం పొంచి ఉందని, అందుకే బిజెపిని తరమికొట్టి దేశాన్ని కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు దేశవ్యాప్తంగా సిపిఐ చేపట్టిన ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో భాగంగా సోమవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన పాదయాత్రలో సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. మోడీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేస్తూ ప్రజల సంపదను, దేశ సంపదను కొల్లగొడుతూ అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని అన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ ప్రజల మధ్య చీలికలు తెచ్చేలా కుట్రలు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.
రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చకుండా కేంద్ర హోంమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం నుంచి ప్రాజెక్టులు ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టకుండా తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం రిజర్వేషన్లు మతం ఆధారంగా కాకుండా వారి సామాజిక పరిస్థితుల అధారంగా అప్పటి రాజశేఖరరెడ్డి సర్కారు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దమ్ముంటే బిసి జన గణన చేపట్టి బిసి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎస్‌టిల రిజర్వేషన్లు పది శాతానికి పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, చిత్తశుద్ధి ఉంటే ఎస్‌టి రిజర్వేషన్లు పెంచుతూ చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

ఇండుస్‌ఇండ్ బ్యాంక్ 140% డివిడెండ్

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2022-23 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 50 శాతం వృద్ధితో రూ.2,040 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ4లో రూ.1,361 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022-23కు గాను ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.14 లేదా 140 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి ఆ బ్యాంక్ ఆఫ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.8.50 శాతం లేదా 85 శాతం బోనస్‌ను అందించింది. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 17 శాతం పెరిగి రూ.4,669 కోట్లుగా నమోదయ్యింది. ఇతర ఆదాయం 13 శాతం వృద్ధితో రూ.2,154 కోట్లుగా చోటు చేసుకుంది.

ఆస్ట్రేలియాలో ఎన్‌ఎండిసి లిథియం ఉత్పత్తి

- ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 21% వృద్ధి లక్ష్యం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 21 శాతం వృద్ధితో 41.22 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరాలని ఎన్‌ఎండిసి లక్ష్యంగా పెట్టుకుంది. 2026-27లో ఏకంగా 60 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయాలని నిర్దేశించుకున్నట్లు ఆ సంస్థ ఉన్నతాధికారి వెల్లడించారు. గడిచిన మార్చి త్రైమాసికంలో ఎన్‌ఎండిసి 14.29 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించింది. అస్ట్రేలియాలో లిథియం రిజర్వులను వెలికితీయాలని యోచిస్తున్నామని ఎన్‌ఎండిసి డైరెక్టర్ (ప్రొడక్షన్) డికె మోహంతి వెల్లడించారు. అక్కడి ఒక గనిలో మెజారిటీ వాటాను పొందినట్లు వెల్లడించారు. ఉత్పత్తికి తుది దశలో ఉన్నామని.. మంచి ఫలితాలు రావొచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లిథియం గని ఆస్ట్రేలియాలోని పెర్త్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు.

పగటివేషగాళ్ల మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మరు

- అమిత్ షా వ్యాఖ్యలపై మంత్రి కొప్పుల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పగటివేషగాళ్ల మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మబోరని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేవెళ్ల సభలో చేసిన వ్యాఖ్యలపై కొప్పుల సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలకు రిజర్వేషన్లనేవి రాజ్యాంగం కల్పించిన హక్కని తెలిపారు. తెలంగాణ సమాజం గురించి అమిత్‌షాకు ఏం తెలుసని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సభలు.. సమావేశాలు పెట్టుకుని పబ్బం గడిపేవారు కేసీఆర్‌ను విమర్శిస్తారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే మైనారిటీ రిజర్వేన్లు తొలగిస్తామని చెప్పడం రాజ్యంగాన్ని అపహాస్యం చేయడమేనని తెలిపారు. దీన్ని బట్టే అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల పట్ల వీరి చిత్తశుద్ధి ఏపాటితో విదితమవుతోందని ఎద్దేవా చేశారు. ఇదేనా బిజెపి నేతలకు రాజ్యాంగం పట్ల ఉన్న నమ్మకం అని ప్రశ్నించారు. దళిత, మైనారిటీ వర్గాలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం షర్మిలను అడ్డుకుంటుంది

- వైఎస్ విజయమ్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిలను ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటున్నదని ఆమె తల్లి వైఎస్ విజయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో విజయమ్మ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం షర్మిలను ఎందుకు అడ్డుకుంటుందో అర్థం కావడంలేదన్నారు. ప్రతిసారి హౌజ్ అరెస్టులతో అణచివేస్తున్నారని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి పరీక్ష పేపర్లు, పదో తరగతి పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయనీ, దీనిపై ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే తప్పేంటని నిలదీశారు. మహిళ అనే కనీస గౌరవం లేకుండా అంతమంది పోలీసులు పైన పడుతుంటే ఆవేశం రాదా? అని ప్రశ్నించారు. పది మంది మహిళా పోలీసులు తనపై పడుతూ, ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తూ నన్ను కార్లో ఎక్కించబోతే నాకూ ఆవేశం వచ్చిందని చెప్పారు. పోలీసులు షర్మిల డ్రైవర్‌ను, గన్ మెన్లను , మీడియా వాళ్లను కొట్టారని వాపోయారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

కేంద్రాలు ప్రారంభించారు.. కొనుగోళ్లు మరిచారు

- ధాన్యాన్ని తగలబెట్టి రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం దాటినా నిర్వాహకులు కొనుగోలు చేపట్టడంలేదని ఆగ్రహించిన రైతులు సోమవారం ప్రధాన రహదారిపై ధాన్యాన్ని తగలబెట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు ఆలస్యం కావటంతో అకాలవర్షంతో కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 17న గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్‌పి చైర్మెన్ లింగాల కమల్ రాజు ప్రారంభించారని, ప్రచార ఆర్భాటమే తప్ప కొనుగోలు చేయటం లేదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ గజ్జెల నరేష్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గుగులోతు క్రాంతిబాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, సిపిఎం నాయకులు తొర్తి సైదులు, బొడ్డు శ్రీను, దేవరపల్లి వెంకట్, పలువురు రైతులు పాల్గొన్నారు

In the Court of the IInd Additional District & Session Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P.No. 134 / 2022
Between :
Kandregula Nagaraju ...*Petitioner*
AND
Ragam Ravi and Others ...*Respondents*
NOTICE TO RESPONDENT
R1 Ragam Ravi S/o. Satyanarayana, Hindu, Age 23 Years, Gulla pochampalli, Medchal, Ranga Reddy Dist. Pin: 500 043. (Driver of Eicher Van bearing Regd. No. TS 12 UD 0079. R3. Syed Ibrahim, S/o. Not Known, Age not Known, D.No. 18-12-419/115, Hafez Baba Nagar, Bandlaguda, Chandrayangutta, Hyderabad, T.S. Pin : 500 058. (Insured of Eicher Van Bearing Regd. No. TS 12 UD 0079)
In the above M.V.O.P. No. 134/2022 the 1st and 3rd respondents hearing date stand posted to **16.05.2023** at **10.30** a.m. before the 2nd additional District and sessions Judge Amalapuram, E.G. Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.
Hearing date : 16.05.2023
N. RAJASEKHAR B.A.B.L.,
Advocate
Amalapuram - 533201
East Godavari Dist. A.P.
Cell : 9849193665, 9618466665

భవన నిర్మాణ కార్మికుల సొమ్ము స్వాహా

- నకిలీ డెత్ సర్టిఫికెట్లతో దందా
- కార్మిక శాఖ ఉద్యోగుల పాత్రపైనా అనుమానాలు
- ఏడాదిలోనే 40,900 మంది కార్మికులు చనిపోయారంట
- 15 దరఖాస్తులు విచారిస్తే అన్నీ ఫేక్ మరణాలే
- ఎనిమిదేళ్లలో రూ.531 కోట్ల ఖర్చు.. ఈ ఏడాది రూ.1,417 కోట్ల వాడకం
- వెల్ఫేర్ బోర్డులో వందల కోట్ల రూపాయల అవినీతి
- వరంగల్ జిల్లాలోనే 25 కోట్ల దుర్వినియోగం
- ఆర్‌టిఐ యాక్టు ద్వారా వెలుగులోకి తెచ్చిన సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సొమ్ము దొడ్డిదారిన స్వాహా అవుతున్నది. నిర్మాణ సంస్థల నుంచి సెస్ వసూళ్ల విషయంలోనే కాకుండా కార్మికుల సంక్షేమం కోసం పెడుతున్న ఖర్చుల్లోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు తెలుస్తున్నది. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు (టిబిఒసిడబ్ల్యుడబ్ల్యు) ద్వారా తెలంగాణ వచ్చిన దగ్గర నుంచి కార్మికుల సంక్షేమం కోసం ఎనిమిదేళ్ల కాలంలో రూ.531 కోట్లు ఇవ్వగా...2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి వరకు రూ.1417 కోట్ల ఖర్చుపెట్టారు. ఇదే విషయం ఇప్పుడు అక్కడ జరుగుతున్న అవినీతి బాగోతాన్ని ఎత్తిచూపుతోంది. ఏడాదిలో 40,900 మంది కార్మికులు చనిపోయారంటూ కార్మిక శాఖ లెక్కలు చూపెట్టడమే విస్తుగొల్పుతోంది. రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా అసెంబ్లీకి కార్మిక శాఖ సమర్పించిన లెక్కల్లో వివిధ సంక్షేమ పథకాల కింద అయిన ఖర్చు రూ.300 కోట్లుగా చూపెట్టారు. సమాచార హక్కు చట్టం ద్వారా పెట్టిన దానికి కార్మిక శాఖ ఇచ్చిన దాని ప్రకారమైతే రూ.1417 ఖర్చుపెట్టినట్టు ఉంది. రెండూ ప్రభుత్వ లెక్కలే. ఎందుకీ వ్యత్యాసం మిగతా డబ్బులేమైనట్టు అనే విషయం తేలాల్సి ఉంది. నిధుల స్వాహాలో అధికారుల ప్రమేయమూ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఫీల్డు విజిట్‌లో అన్నీ బోగసే...

సూర్యాపేట జిల్లాలో 80 డెత్ క్లయిమ్స్‌పై వెల్ఫేర్ బోర్డుకు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ కోసం వెల్ఫేర్ బోర్డు కొందరు అధికారులను ఫీల్డు విజిట్‌కు పంపగా 15 దరఖాస్తులను వారు పరిశీలించారు. చివ్వెంల, ఆత్మకూరు మండలాల్లోని రాజుతండా, పాండ్యానాయక్ తండా, మున్యానాయక్ తండా, తుమ్మల పెన్‌పహాడ్, రామోజీ తండాలలో అధికారులు పర్యటించారు. ఆయా గ్రామపంచాయతీల్లో ఏడాది కాలంలో జారీ అయిన మరణ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. చివ్వెంల మండలంలోని మున్యానాయక్ తండాలో ఐదు మరణాలపై విచారణ జరపగా... అసలు ఆ గ్రామ పంచాయతీ ఆ పేర్లతో మరణ ధ్రువీకరణ పత్రాలే ఇవ్వలేదని తేలింది. ఆత్మకూరు (ఎస్) మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ పంచాయతీ పరిధిలో నలుగురి పేరిట నిధులను స్వాహా చేశారు. దీనిపై గ్రామపంచాయతీలో విచారణ జరపగా...అధికారులు చూపెట్టినవన్నీ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలని తేలింది. చివ్వెంల మండలం పాండ్యా తండాలో నాలుగు మరణాలపై విచారణ జరపగా..అవీ ఫేక్ సర్టిఫికేట్ల ద్వారానే నిధులను పక్కదోవ పట్టించినట్టు వెల్లడైంది. సూచనప్రాయంగా అధికారులు 15 మరణాలపై విచారణ జరపగా.. అన్నీ ఫేక్ అని తేలడం విస్తుగొల్పే అంశం. బోగస్ డెత్ సర్టిఫికేట్లు, బోగస్ ఎఫ్ఐఆర్‌లు, బోగస్ డాక్యుమెంట్లతో కొందరు దళారులు, మీసేవ కేంద్ర నిర్వాహకులు, బోర్డు కార్యాలయంలోని కొందరు ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఖర్చు చూపెట్టింది ఇలా..

రాష్ట్రంలో టిబిఒసిడబ్ల్యుడబ్ల్యు ద్వారా 2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి మధ్య కాలంలో 2,56,000 మంది లబ్ధి పొందారు. దీనికి గానూ వెల్ఫేర్ బోర్డు ఖర్చుపెట్టింది రూ.1,417 కోట్లుగా చూపెట్టారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో కార్మికుల సంక్షేమం కోసం పెట్టిన ఖర్చు రూ.256.85 కోట్లు మాత్రమే. మొత్తం 2014 నుంచి 2020 వరకు కార్మికుల సంక్షేమం కోసం రూ.531 కోట్లు వాడారు. అదే 2022-23కు వచ్చేసరికి అది రూ.1,417 కోట్లకు చేరడమే ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇంకో గమ్మత్తైన విషయమేమిటంటే రాష్ట్ర బడ్జెట్‌లో ఆ ఖర్చు రూ.300 కోట్లుగా చూపెట్టారు. ఇంత పెద్ద తేడా ఎందుకు వచ్చింది? అనూహ్యంగా ఏడాదిలో ఇంత ఖర్చు ఎలా పెరిగింది? నిజమైన లబ్దిదారులకు డబ్బు అందిందా? బడ్జెట్‌లో చూపెట్టిన దానికంటే నాలుగురెట్లు అదనంగా ఎలా ఖర్చయింది? అన్న ప్రశ్నలకు కార్మిక శాఖ అధికారులే సమాధానాలు చెప్పాలి. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

ఏడాదిలోనే 40,900 మంది కార్మికులు చనిపోయారా?

ఒక్క ఏడాదిలోనే 40,900 మంది భవన నిర్మాణ కార్మికులు చనిపోయారా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. బోర్డు ద్వారా బాధిత కుటుంబాలకు రూ.525 కోట్లు ఇచ్చారు. 14 నెలల కాలంలో వివిధ ప్రమాదాల్లో 4027 మంది కార్మికులు చనిపోయినట్టు, 313 మంది అంగవైకల్యం పొందినట్టు సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన పత్రాల్లో ఉంది. వారి కోసం రూ.260 కోట్లు చెల్లించారు. ప్రసవ సహాయం కింద 1,38,250 మంది లబ్దిదారులకు రూ.415 కోట్లు ఇచ్చారు. పెండ్లీండ్ల కానుక కింద 71,661 మంది లబ్ధి పొందారు. దీని కోసం రూ.215 కోట్లు ఖర్చుపెట్టారు. సూర్యాపేట జిల్లాలో శాంపిల్‌గా 15 మరణాలపై విచారణ జరిపితే అన్నీ ఫేక్ అని తేలాయి. వరంగల్ జిల్లాలో డెత్ క్లయిమ్ లబ్దిదారులకు రెండు సార్లు డబ్బులు చెల్లించడం వల్ల రూ.64 లక్షలు స్వాహా అయ్యాయి. వరంగల్ జిల్లాలో ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు చెల్లింపులు జరిపే విషయంలో రూ.25 కోట్లు దుర్వినియోగం జరిగింది. హనుమకొండ జిల్లా పరకాలలో బోగస్ డెత్ క్లయిమ్స్‌పై దందా నడిపిస్తున్న ఓ అధికారి బంధువును పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇవి బట్టబయలైనవే. అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి అవినీతి పెచ్చుమీరిపోయినట్టు తెలుస్తున్నది.

కార్మిక శాఖలోని అవినీతి, అక్రమాలను తేల్చాలి ఎం శ్రీనివాస్, సిపిఎం నగర కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ఎసిబితో విచారణ జరిపించి కార్మిక శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను తేల్చాలని సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం మహేందర్, ఎం దశరథతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా లబ్దిదారులకు పంపిణీ చేస్తున్న నిధుల విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని తెలిపారు. తాము సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలే ఆవిషయాన్ని తెలుపుతున్నాయని వివరించారు. వెల్ఫేర్‌బోర్డు దళారుల కేంద్రంగా మారిందని విమర్శించారు. సూర్యాపేట జిల్లాలోని డెత్ సర్టిఫికేట్ల వ్యవహారం, వరంగల్ జిల్లాలో డబుల్ పేమెంట్ చెల్లింపు, మరణాల కేసుల ఇచ్చే చెల్లింపుల్లో రూ.25 కోట్ల అవినీతిని ఎత్తిచూపారు. పర్యవేక్షణా లోపంతో కార్మిక శాఖలో అవినీతి ఏటేటా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క ఏడాదిలోనే 1,417 కోట్ల రూపాయల నిధుల పంపిణీ వెనుక భారీ కుంభకోణం జరిగిందని విమర్శించారు. బోగస్ డాక్యుమెంట్లపై విచారణ జరిపితే అన్ని విషయాలు బట్టబయలు అవుతాయన్నారు. ఈ కుంభకోణంలో వెల్ఫేర్‌బోర్డులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేట్ పాత్ర ఉందని, ఆయనకు కార్మిక శాఖలోని ఉన్నతాధికారులతో సత్సంబంధాలున్నాయని విమర్శించారు. సెస్ వసూళ్లల్లో జరుగుతున్న అక్రమాలపై సిపిఎం బట్టబయలు చేసిందనీ, విజిలెన్స్ శాఖ విచారణలోనూ అది నిజమని తేలిందని చెప్పారు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా రాష్ట్ర సర్కారు వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎసిబితో విచారణ జరిపించి కార్మికులకు అందాల్సిన సొమ్మును కొల్లగొడుతున్న దళారులు, అధికారులను కఠినంగా శిక్షించాలి.

29 న కవి, పండితులు రామకృష్ణమాచార్య జయంతి

ప్రజాశక్తి-కల్చరల్

విఖ్యాత కవి పండితులు ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య 103 వ జయంతి ఉత్సవం ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం కార్యదర్శి ఆచార్య ఫణీంద్ర, నవ్య నాటక సమితి అధ్యక్షుడు విజయ్ కుమార్ వేమరాజులు తెలిపారు. సంస్థ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికను పీఠం అధ్యక్షులు కల్లెపు సాగర రావు అవిష్కరించి మాట్లాడుతూ శ్రీకృష్ణ భాషా నిలయం లో 29 న జరిగే కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ పాల్గొని నండూరి సాహితీ పురస్కరం ప్రముఖ కవి రసరాజు కు బహుకరిస్తారని, సాహితీవేత్త ఆచార్య టి. గౌరీ శంకర్ అధ్యక్షత వహిస్తారను తెలిపారు అతిథులుగా వసుంధర, డాక్టర్ చిల్లర భవాని ,ఆత్మకూరు గాంధీ, కె సాగర్ రావు పాల్గొంటారు. రామకష్ణమాచార్య పద్య కవిగా ప్రసిద్ధులు. నాటి రాష్ట్ర పతులు ఎస్ రాధాకృష్ణన్, శంకర్ దయల్ శర్మ వంటి వారల అభినందనలు అందుకొన్నరు. సమైక్య ఆంధ్రప్రదేశ్ లో అధికార భాషా సంఘం అధ్యక్షులుగా పని చేశారు.

గ్రాట్యూటీపై సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్ల గ్రాట్యూటీపైన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఐసిడిఎస్ డైరెక్టర్ లక్ష్మీదేవికి ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పద్మ, పి జయలక్ష్మి, కోశాధికారి కె సునీత వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా పరిగణించాలనీ, గ్రాట్యూటీ చెల్లింపు 1972 చట్టం ప్రకారం గ్రాట్యూటీకి వారు అర్హులని సుప్రీం కోర్టు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. మెరైగన పని పరిస్థితులను కల్పించేందుకు విధివిధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలనే ఆదేశాలను పాలకులు బుట్టదాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలనీ, కనీస వేతనాలు, పింఛన్ చెల్లింపులకు తగిన ఆర్థిక కేటాయింపులు, ఐసీడీఎస్ పటిష్టత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'తెలంగాణ సోన వరి' మార్కెటింగ్ కోసం..

కర్నాటక రైస్ ఇండస్ట్రీస్ సంస్థ, వ్యవసాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్నాటకతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ సోన, ఆర్ఎన్ఆర్-15048 వరి రకం బియ్యం మార్కెటింగ్‌కు సంబంధించి కర్నాటక (బళ్లారి)కి చెందిన మల్లికార్జున రైస్ ఇండస్ట్రీస్ సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఒప్పంద పత్రాలపై మల్లికార్జున రైస్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు మల్లికార్జున్, మంజునాథ, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్ కుమార్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ జమునారాణి, రాజేంద్రనగర్‌లోని వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అమిత్ షా పర్యటన

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం అన్యాయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన ముఠా నాయకుడిగా తెలంగాణకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఏం చేస్తారో చెప్పకుండా బండి సంజయ్‌ని అరెస్టు చేస్తే నిద్రపట్టలేదంటూ ఫ్యాక్షనిస్టులా మాట్లాడారని చెప్పారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే రాష్ట్రానికి ఆయన వచ్చారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ముస్లింలకు రిజర్వేషన్లను సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చారు తప్ప మతం ఆధారంగా కాదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ పెంచుతామంటూ అమిత్ షా అన్నారని, ఆయనకు నిజంగా హిందువుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ల పరిమితిని 50 శాతం ఎందుకు పెంచడం లేదని అడిగారు. ఎస్టీ రిజర్వేషన్‌ను ఆరు నుంచి పది శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభ పంపిన తీర్మానాన్ని ఏండ్ల తరబడి కేంద్ర ప్రభుత్వం ఎందుకు నాన్చుతున్నదని ప్రశ్నించారు. రిజర్వేషన్లకు ఆధారమైన బీసీ జనగణన చేయించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ఒప్పించడం లేదన్నారు. త్వరలో తెలంగాణలో ఎన్నికలు ఉన్న కారణంగానే హిందూ, ముస్లిం పేరుతో ఓట్లలో చీలిక తీసుకొచ్చేందుకు అమిత్‌షా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. హిందువులపైన నిజంగా ప్రేమ ఉంటే, వివేకానంద ఏం చెప్పారో చదవాలని, అలాగే శివాజీ సైన్యంలో ఎంత మంది ముస్లింలు ఉన్నారో తెలుసుకోవాలని బీజేపీ నేతలకు సూచించారు. రాజకీయాల కోసం మతాన్ని ఉపయోగించుకోవడం దుర్మార్గమన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌పై కేంద్ర ప్రభుత్వం కక్షగట్టిందని విమర్శించారు. పుల్వామా దాడికి భద్రతాలోపాలు, గోవాలో జరిగిన అవినీతిని ప్రస్తావించిన కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. న్యాయవ్యవస్థను కేంద్రం గుప్పెట్లో పెట్టుకుందన్నారు. బీజేపీకి ఇష్టంలేని వారు హిందూ మతానికి చెందిన వారైనా చంపేస్తున్నారని, గాంధీ, గౌరీలంకేశ్, పన్సారే, కల్బుర్గిని హత్య చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. దేశాన్ని పరిరక్షించాల్సిన ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా విచ్ఛిన్నకర శక్తులుగా మారారని విమర్శించారు. కేసీఆర్ కంటే బీజేపీతోనే ఎంఐఎంకు ఎక్కువ సంబంధాలున్నాయని చెప్పారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా బీజేపీ, ఎంఐఎం పరస్పర అవగాహనతో పోటీ చేస్తున్నాయని వివరించారు. సమ్మె చేయనున్న ఆర్టిజన్లను పెద్ద నేరస్తులుగా, సంఘ విద్రోహులుగా చిత్రీకరించడం, కనీసం మీడియా సమావేశాన్ని కూడా నిర్వహించుకునే అవకాశాన్ని ఇవ్వకపోవడాన్ని కూనంనేని ఖండించారు. రూ.లక్ష వరకు రుణమాఫీ చేయాలని, పోడుభూముల సమస్యను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజకీయ దురుద్దేశంతోనే అమిత్ వ్యాఖ్యలు : అజీజ్‌పాషా

రాజకీయ దురుద్దేశంతోనే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ అమిత్‌షా వ్యాఖ్యానించారని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా విమర్శించారు. ముస్లింల పరిస్థితి దళితుల కంటే అధ్వాన్నంగా ఉన్నదంటూ పలు కమిటీలు ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయని గుర్తు చేశారు. దేశంలో ఎవరి పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనా లేకుండా ఆయా వర్గాలకు ఎలా న్యాయం చేస్తారని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంటనష్టంపై సత్వరమే సర్వే చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ డిమాండ్ చేశారు.

అమిత్ షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం : నారాయణ

బిజెపి అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి, లౌకిక వ్యవస్థకు వ్యతిరేకమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. కేంద్రంలో బాధ్యతాయుతంగా ఉండాల్సిన హోంమంత్రి మతతత్వాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడడం దురదృష్టకరమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితులు, గిరిజనుల కంటే ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారంటూ సీపీఐ నేత చంద్రరాజేశ్వర్‌రావు పరిశీలన చేసి చెప్పారని గుర్తు చేశారు. గతంలో ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఐదు శాతం నుంచి నాలుగు శాతానికి ముస్లిం రిజర్వేషన్లను తగ్గించారని పేర్కొన్నారు. క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న అమిత్‌షా మతతత్వాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడ్డాన్ని తీవ్రంగా ఖండించారు.

పంట నష్టం వివరాలివ్వండి

- జిల్లా కలెక్టర్లకు సిఎస్ శాంతికుమారి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో జరిగిన పంట నష్టంపై వివరాలను అందించాలంటూ జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతికుమారి ఆదేశించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లతో సీఎస్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం వివరాలను వచ్చేనెల ఒకటో తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ప్రతి మండలానికీ ప్రత్యేక అధికారులను నియమించి జరిగిన పంట నష్టం వివరాలను సమర్పించాలని సిఎస్ కోరారు. గతంలో జరిగిన పంట నష్టానికి సంబంధించి పరిహారాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు వివరించారు. రాష్ట్రంలో మరికొన్ని రోజులపాటు ఉరుములతో కూడిన వర్షాలు సంభవించే అవకాశమున్నందున ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడవకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం : టిఒఎమ్‌సిఒఎమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ నియామాలను సులభతరం చేయడానికి ఈ నెల 27న హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటిఐ క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టిఒఎంసిఒఎం) సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 22 నుంచి 35 ఏళ్ల వయస్సు గల బిఎస్‌సి నర్సింగ్, జిఎన్ఎం డిప్లొమా కోర్సు పూర్తిచేసినవాళ్లు జర్మన్ భాషా తరగతుల్లో చేరడానికి ఈ అవగాహనా కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొంది. ఎలాంటి ముందుస్తు పని అనుభవం లేని ఫ్రెషర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించింది. జర్మన్ భాష పై నివాస శిక్షణ, జర్మనీలో పనిచేయడానికి అవసరమైన అదనపు వృత్తి పరమైన నైపుణ్యాలను తమ సంస్థ ద్వారా అందిస్తామని పేర్కొంది.

విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు నెలవారీ 1.9-2.5 లక్షల వరకు వేతనం, ఇతర అలవెన్స్‌లు, కుటుంబ వీసాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపింది. పరిమిత సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల నర్సింగ్ అభ్యర్థులు 9908830438, 7901290580, 9502894238 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించింది. టిఒఎంసిఒఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని కోరింది. మరిన్ని వివరాల కోసం www.tomcom.telangana.gov.in సందర్శించాలని సూచించింది.

ఆకట్టుకున్న చుక్క రాములు ప్రసంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహేంద్ర అండ్ మహేంద్ర ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, మహేంద్ర అండ్ మహేంద్ర యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు ప్రసంగం సభికులను, మంత్రిని ఆకట్టుకుంది. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో రూ.వెయ్యి కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ హాజరయ్యారు. 'కార్మికులు, పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం సవ్యంగా ఉంటే ఆ రాష్ట్ర అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలోకి పెట్టుబడులు వస్తాయి' అని మహేంద్ర కార్మిక యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అనడంతో... ఆ మాటలకు ఆకర్షితులైన మంత్రి కేటీఆర్ హర్షధ్వానాలతో చుక్క రాములును అభినందించారు. సిఐటియు యూనియన్ రాష్ట్ర అభివద్ధికి, కార్మికులు, యాజమాన్యాల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తోందని చుక్క రాములు అన్నారు. అపార అనుభవం కలిగిన చుక్క రాములు మహేంద్ర యాజమాన్యాన్ని అన్ని విధాలా ఒప్పించగలుగుతున్నారని కార్మికులు చర్చించుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మే డే వారోత్సవాలు

- రైతు, వ్యకాస, కార్మిక సంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చారిత్రాత్మకమైన మే డేను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మే 1 నుంచి 7 వరకు వారోత్సవాలను నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సిఐటయు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలో జరిగిన మహత్తరమైన పోరాటంలో అనేకమంది కార్మికులు బలిదానం చేశారని గుర్తు చేశారు. దాని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నారని అన్నారు. ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానంతోపాటు వారి హక్కులను హరిస్తోందని అన్నారు. నాలుగు రకాల లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి 29 చట్టాలన్నింటినీ కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రవ్యాప్తంగా కార్మిక వర్గంలోకి విస్తతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రైతుల హక్కులను కాపాడాలి, కనీసం మద్దతు ధర ఇవ్వాలి, నల్లచట్టాల రద్దు చేయాలనే డిమాండ్లపై చారిత్రాత్మక రైతు పోరాటం జరిగిందని గుర్తు చేశారు. తద్వారా ఆ మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి కొట్టినప్పటికీ వాటిని మరో రూపంలో తీసుకొచ్చి కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని అన్నారు. పని హక్కు కోసం ఆనాడు వామపక్షాలు యుపిఎ ప్రభుత్వంతో పోరాడి ఉపాధి హామీ గ్యారెంటీ చట్టాన్ని సాధించాయని అన్నారు. దాన్ని కూడా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజల మీద తీవ్రమైన భారాలను కేంద్ర ప్రభుత్వం మోపుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో వారం రోజులపాటు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే రాబోయే కాలంలో కార్మికులు, కర్షకులను కలిపి ఐక్యంగా మహా ఉద్యమాన్ని చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పాల్గొన్నారు.

మూడు నెలల్లో 'సీతారామ' నీరు

- 14 లక్షల ఎకరాల నుంచి 54 లక్షలకు వరి సాగు పెంచాం
- బిజెపికి డిపాజిట్ రాదు
- కాంగ్రెస్ పాలన అవినీతిమయం
- బిఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడు నెలల్లో సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లు ప్రజల దరిచేరుస్తామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో కరువు అనే పదాన్ని డిక్షనరీలో లేకుండా చేశామన్నారు. 14 లక్షల ఎకరాలుగా ఉన్న వరి సేద్యాన్ని 54 లక్షలకు పెంచామన్నారు. ఖమ్మం జిల్లాలో బిజెపికి డిపాజిట్ దక్కే అవకాశమే లేనప్పుడు రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ఎద్దేవా చేశారు. స్థానిక శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన సోమవారం ఖమ్మం జిల్లా కల్లూరులో నిర్వహించిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ముందుకు నడిపిస్తుంటే ఓర్వలేక బిజెపి అబద్ధాలతో నిజాన్ని కనుగుమరుగు చేయాలని చూస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కరువు కాటకాలతో అల్లాడి పోయిందని తెలిపారు. 24 గంటల కరెంటు, రైతు బీమా, రైతు బంధు, సాగునీరు, పండించిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయడంతో రాష్ట్రంలో వ్యవసాయం వృద్ధిలోకి వచ్చిందని చెప్పారు. రబీలో ధాన్యాన్ని కొనలేమని కేంద్రం చేతులెత్తేసినా రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక్క గింజను కూడా వదలకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డాక భూమి విలువ పెరగడంతో పాటు పంట విస్తీర్ణం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగును విస్తరింపచేస్తున్నామన్నారు. కర్ణాటకలో ఓడిపోతామని, తెలంగాణలో ఏమి అధికారం సాధిస్తామనే ఫ్రెస్టేషన్‌తోనే బిజెపి ఇష్టానుసారంగా మాట్లాడుతుందన్నారు. ఢిల్లీ పెద్దలకు కాంగ్రెస్ మోకరిల్లితే.. గుజరాత్ పెద్దలకు బిజెపి గులాం చేస్తుందని విమర్శించారు. పేపర్ లీకేజీ విషయంలో బెయిల్ మీద వచ్చిన వాళ్లను పక్కన పెట్టుకొని

సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బిఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ రద్దు చేసి రాష్ట్రాన్ని దోచుకుంటుందనిని ఆరోపించారు. ఎవడు ఎన్ని ట్రిక్కు లేసినా కెసిఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. రెండు, మూడు నెలల్లో సీతారాం ప్రాజెక్ట్ నీరు సత్తుపల్లి గడ్డకు తీసుకువచ్చి రైతుల కాళ్లు కడిగి రుణం తీర్చుకుంటామన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది నుంచి వైద్య కళాశాల : మంత్రి అజయ్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి వైద్య కళాశాల ప్రారంభమవుతుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. కేసీఆర్ పేద ప్రజల్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ విద్యా వైద్యాన్ని అభివృద్ధి చేస్తూ అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సత్తుపల్లిలో వంద పడకలు, పెనుబల్లిలో 50 పడకలు, కల్లూరులో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణాలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. సండ్ర వెంకట వీరయ్య మూడుసార్లు గెలిచి సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు టీఆర్ఎస్ గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. సభలో బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, జడ్పీ చైర్మెన్ లింగాల కమలరాజ్ తదితరులు ప్రసంగించారు.

శ్రీచైతన్య, నారాయణపై కేసు నమోదు చేయాలి

- ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఎఐవైఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిబంధనలను ఉల్లంఘిస్తూ అడ్మిసన్లు నిర్వహిస్తున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలపై కేసులు నమోదు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ బాలకృష్ణ, నిర్లకంటి శ్రీకాంత్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్ బోర్డు నిబంధనలను బేఖాతరు చేస్తున్న కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల ఆగడాలను అరికట్టాలని, గుర్తింపు లేని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు.

నేటినుంచి బడులకు వేసవి సెలవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు మంగళవారం వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 11వ తేదీ వరకు విద్యార్థులకు ఈ సెలవులుంటాయి. అదేనెల 12వ తేదీన పాఠశాలలు పున్నప్రారంభమవుతాయి. అయితే జూన్ ఒకటో తేదీ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. అందుకోసం ఉపాధ్యాయులు ఆ రోజు నుంచి విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. వేసవి సెలవుల్లో మన ఊరు-మన బడి, మనబస్తీ-మన బడి కార్యక్రమానికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. సర్కారు బడుల ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందుబాటులో ఉంచాలని చర్యలు చేపట్టారు.